# అనుమాన పిశాచము

శ్రీమతి వి. రాజలక్ష్మి గారు

శ్రీహరిశాస్త్రి నివాసం పట్టణంలోనే. ఆయన భార్య శేషమ్మ. వారికి పిల్లలు ముగ్గురే. తొలిసంతానం సరస్వతి. ఆపిల్లకి శారదాబిల్లు ముందరే చేసేరు పెళ్లి. ఇప్పుడు సరస్వతికి రజస్వలాలయే యీడు. రంగడుకి ఎనిమిదేండ్లుంటాయి. ఐదవక్లాసు చదూతున్నాడు. గౌరి ఐదేళ్లది. శాస్త్రిగారి కుద్యోగమేమీలేదు కాని తిండానికి లోటులేకుండా తాతతండ్రులు ఆర్జించేరు భూములు. శాస్త్రిగారికి 'నా'యనేవారెవరూలేరు.

యదుభూషణరావుగారు శాస్త్రిగారింటి పొరుగునేయున్న కోమటిగుమస్తా. మంచి ధనవంతుడు. ఆయన భార్య కమల. ఆవిడకో పాతికేండ్లుంటాయి. ఆయనకీ ముప్పదిఏడు దరిదాపు. పిల్లలుమాత్రం లేరు. ఆ యిద్దరే ఉనివసించేవారాయింట్లో.

ఈ రెండు కుటుంబములతోటే ఉంది మన కథంతా.

౧

(శాస్త్రిగారు వీథి యరుగుమీద—రంగడు, గౌరీ అప్పుడే పడుకుంటారు — రాత్రి — శేషమ్మగారు, సరస్వతి వంటఇంట్లో.)

"ఏఁవండీ, భోజనానికి లేస్తారా?"

"..............."

"ఏఁవండీ?—ఉఁన్నారా?"

"..............."

"ఏఁవండీ?"

"అరుస్తావేఁవిటి గాడిదలాగ? మతిలేదూ?"

"పలకలేదని కొంచెం గట్టిగా పిల్చేను."

"పిలవడం సొంపేనా అది? అయితే సరే."

"..............."

"..............."

"కాళ్లు కడుక్కుందికి నీళ్లు తెచ్చేదా?"

"లేవాలనుంటే తెచ్చేయుందువు. ఎందుకు తేవాలి?... నేనే పోతాను నూతికి."

* * *

"ఏఁవిటే! అన్నం ఇలాగుంది? జగన్నాథ ప్రసాదంలాగ! అనపగాయ ఉడకలేదు. ఏడిసినట్టు ఉంది. ఎలా ముద్దమింగడం?"

"అదేఁవో మరి, పప్పుకూర బాగుందంటూ తిన్నారు పిల్లలు. ఏఁవే సరస్వతీ?"

"అయితే ఆ సాక్ష్యఁవేఁవిటి. పోనీ నేనే అబద్ధమాడేను."

"అదికాదండీ;"

"మరేఁవిటి? నాకు సరదా కాబోలు పుట్టినే అలా అనడం?"

"..............."

"కూర అయింతేనా అయింది? అంతకాయ కొన్నాను!"

"మరెంతవుతుంది? కమల అడుగుతే కొంచెంకూర ఇచ్చేను."

"అది! అలాచెప్పు. ఆయనకేదీ మంచికూరలేదు కాబోలు."

"ఏమ్మాటలండీ, ఎవరేనా వింటే నవ్వుతారు! కమలనోరు విడుచుగు అడిగిందనీ, నిన్న మొన్న అదే మనకికూర ఇచ్చిందనీ కాని లేకపోతే నాకేఁవిటి? పోనీండి, ఇహ—"

"అయితే ఇప్పుడెవళ్లేఁవిటన్నారు. నోరుముయ్. ఉన్నమాటంటే ఉదాశీనంలావు."

"ఇవి ఉన్నమాటలా? రామ! రామ!!"

"చిన్న పిసరుకి ఎందుకింత రాద్ధాంతం చెయ్యడం?" అంది సరస్వతి మెల్లిగా.

"అవునర్రా చిన్నవాళ్ల దగ్గర్నుంచీ పెద్దవాళ్ల దాకా బుద్ధిచెప్పే వాళ్ళేను!" అన్నాడు శాస్త్రి.

౨

(అప్పుడే సూర్యోదయం అయింది.—సరస్వతి, తమ్ముడికి, చెల్లెలకు చద్దిఅన్నము పెడుతూంది—శేషమ్మ కాఫీ పొయ్యివద్ద—శాస్త్రి ఇంట్లో పచారీ చేస్తూను—)

"ఏమే అంత తెల్లవారకుండా లేచావెందుకూ ఇవాళ?"

"మరి అంట్లూ చెంబులూ అవీ కాపడానికేసుకుని వీధిగుమ్మం కడిగి ముగ్గుపెట్టుగుని, ముఖం కడుక్కుని కాఫీపెట్టేసరికప్పుడే ఇంతసేపైందికదా లేవకపోతే ఎలాగ?"

"ఓహోహో! ఈపన్లు చెయ్యడానికంత తెల్లవారకుండా లేవాలీ?"

"బాగుంది! ఆడవాళ్లందరూ అలాగే లేస్తారు."

"నేను, తెల్లవారి లేచేను, అప్పటి కెవళ్లూ లేవలేదు!"

"వచ్చి మీతో లేచేనని చెప్తారేంవిటి ప్రతివాళ్లూ" అంది సరస్వతి.

"అబ్బ! ఏం తెలివి? నాతో చెప్తారన్నానా?"—

"ఎందుకీ సాధింపు? అమ్మ చేసిన తప్పేంవిటి?"

"తప్పని ఎవళ్లన్నారు? నీసాధింపేంవిటి మధ్యని? ఎలాగైతేనేం పెద్దదాని వయ్యేవు!"

"పెద్దవాళ్లు వక ఉండిపోతారూ?" అంది సరస్వతి మెల్లిగా.

"ఆ గొణుగులెందుకు? పౌరుషంజాస్తీ."

* * *

"ఛీ! ఎందుకొచ్చినజన్మ? రామ! రామ!! ప్రతీదానికీ కాల్చుకుతినెయ్యడమేనా? ఒకనాడు సరదాగా ఉందామంటే వీల్లేదు. ఎప్పుడూ అనుమానమేనా?.........సరస్వతి లేకపోవడంచూచి కొట్టడంకూడాను; అదుంటే కొంత జంకుతారు.... ఇంతకంటె చస్తేమేలు...జన్మానికోసారేనా ఇల్లు కదలరు, సరేగదా నన్ను కదలనీయరు!......... పోనీ ఏంవీవద్దు ఇంతతింటూ పడిఉందామంటే అలా ఉణ్ణివ్వరు........"

* * *

"వెంకయ్యగారింటికి అటుగుల్దంపుకి రమ్మన్నారు వాళ్లు."

"అయితే? నాతో చెప్పడం వెందుకు?"

"వెళ్తాను."

"ఇంతాలస్యం వెందుకుచేసేవు? అన్నంతినగానే వెళిపోలేకపోయే?"

"పోనిండి మరోగంట పోయాకే వెళ్తాను."

"పోనియ్యడంవేంవిటి? ఇప్పుడే వెళ్లు."

"................"

"ఇదుగో చెప్తున్నాను విను. ఇప్పుడు వెళ్లకపోతే పనికిరాదు. మాటంటే అంతపంతం వేంవిటి? నాకేం బోధపడదు!"

"పంతంవేంవిటి? మీరలా చెప్తే అలాగే చేస్తుంది" అన్నాది సరస్వతి కొంచెంకోపంతో.

"ఏంవిటీ? నీ ఇదేంవిటి నాకేం తెలిసింది కాదు? నువ్వు మాటాడకు."

(శేషమ్మగారికి శాస్త్రిగారిచేత నాలుగు తనులును. సరస్వతి అడ్డువెళ్లి తానుకూడ కొంచెమనుభవించును.)

* * *

"అల్లుడుకి రమ్మని వ్రాసేరా?"

"భోజనంచేస్తూన్నప్పు డిదేంఘోష? అల్లుడో, అల్లుడో అని ఏడుస్తావేంవిటి?"

"ఇదేం పైషోమకాదే ఇంటిష్షోష్!" అన్నాది సరస్వతి నవ్వుతూ.

"వెయ్యిసార్లు చెప్పేను. నువ్వు మధ్యని మాటాడకు!"

"దాంతో ఏఁవిటి?—ఈ ఉత్తరం వ్రాసేరా?"

"అల్లుడు ఎప్పుడు వస్తాడని బెంగపెట్టుకు పోతున్నావు కాబోలు నువ్వు. నావద్ద డబ్బులేదు నే వ్రాయలేదు."

"..............."

"..............."

"ఏఁవిటిప్పు డింతఖర్చ్యాను. నలుగురుతో ఇంత అంటాడు అల్లుడుకూడా అంతేకాదూ?"

"అవును అతిండే నే పెట్టలేను. నీకు కావులిస్తే నువ్వు వ్రాసి తెచ్చుకో అల్లుణ్ణి."

"ఏమ్మాటలూ? ఎవరేనా వింటే—"

"నోరుముయ్—వెధవలు తిండేనా తిన్నగా తిననివ్వరు."

## 3

(మధ్యాహ్నసమయమున భోజనముల వేళ—శాస్త్రిగారు పీటమీద భోజనమునకై అధిష్టించి—రంగ, గౌరి, అన్నముతింటూ—శేషమ్మగారు వడ్డిస్తూ—సరస్వతి కూర్చుని—ఉంటారు.)

"ఇంత ఆలస్యంగా వంటయిందేఁవిటే ఇవ్వాళ?"

"కమల వాకటుంది, వాళ్ళవంటకూడా వండవలసొచ్చింది."

"వాళ్ళవంటంటే సంభరపడుతూ చేస్తావు.—"

"మనవంటమాత్రం చెయ్యలేదూ?" అన్నాది సరస్వతి.

"చేస్తున్నాది ఏదో విధిలేక."

"..............."

"అన్నం అవీ వాళ్ళఇంట్లో పడిస్నేవే?"

"ఊఁ."

"గుమస్తాగా రేఁవిటి చేస్తున్నారు? ఆయన పాపం వడ్డించుకోగలరూ?"

"ఇలాంటి మాట్లని సాకళ్ళంట నీళ్లు కార్పించకండీ! నేనేఁ వాయనకదిలో కెళ్లి చూసేనా ఏంచేస్తున్నారో తెలీడానికి? అన్నం ఇంట్లో పడిస్నే కమలతో చెప్పి వచ్చిస్నేను గాని, సరస్వతికూడా కూరపట్టుకు వచ్చిందివాతో, దాన్నడగండి నేనేఁవిచేసేనో అక్కడ."

"అదిమాత్రం నీకూతురేనా మరేంపైధా?"

"నాన్నగారూ! ఇలాంటిమాట్లని ఆడవాళ్లకి విచారం కలుగజేస్తే ఇంటికి నాశనమండీ—"

"మెల్లిగానా ఆమాట!"

"వెధవల్లల్లా శాపాలు పెట్టకర్రా. మీ మొఖాలీడ్చ!—"

*　　　*　　　*

"ఒరే రంగా ఏఁవిట్రా చాకలిపద్దు ఇలా వేసేవు? వెధవా! ఏడిసినట్టేయుంది!"

"ఏఁవండీ?"

"ఏఁవేఁవిటి?— చింకిగౌరి తెల్లకబ్బా; ఎర్ర అక్కయ్య పర్కిణీ; దుక్కనానగారి దుప్పటి—నీ వెత్తి ఏఁవిటిలా వ్రాసేవు? — వెధవా! మాట్లాడవేం!"

"కాదండీ, అక్కయ్య ఎర్రపరికిణీ, గౌరిచింకి తెల్లకబ్బా, నానగారి దుక్కదుప్పటి అన్నమాట!"

"వెధవా, పోతరం లావవుతున్నా నేఁవిటి? — ఆ మంచంపట్టుకు కేళ్లాడతావేఁవి టిలారా!"......

(శాస్త్రి రంగణ్ణి కాళ్లతో మడుతూ కొట్టుచుండును.)

"నాయనో! నాయనో! — అమ్మా! — అమ్మా! — అక్కా! — చచ్చిపోయేనర్రోయ్ — దేఁవుడా!"

"అబ్బ !—— నాన గారూ ! మతిలేదండీ ? చంపేస్తారా ఏమిటి ? అబ్బ — చూడలేకుండా ఉన్నావండీ — మీకు ఎలా చేతులొస్తున్నాయో కొట్టడానికి ? — అమ్మా ! అమ్మా !" (అంటూ సరస్వతి కన్నీరుతో, ఏడుస్తూయున్న గారిని దగ్గరగాతీసుకొని తల్లినిపిలుచును.)

"వెధవా ! మెల్లిగాకొట్టినా చంపేస్సినట్టు గరుస్తావేమిటిరా ? ఏంవేషాలు నేర్చుగున్నావురా ! నోరు ముయ్."

"అమ్మా ! అమ్మా ! — ఏడవలేన్రా ! — అమ్మా — కొ ... డ ... తారు."

"ఏమండీ ? — నామీద కోపమ్వుంటే నన్ను కొట్టండిగాని పిల్లాణ్ణి చంపకండి. వాడేంచేసేడు ? — ఇదుగో —"

"వెధవల్లల్లా ! గుంటవెధవని వెనకేసుగొస్తారూ ? ఏడవండి. నాకేంగావాలి? వాడినికూడా చెడపండి."

* * *

"ఏమండీ అన్నానికిలెండి."

"ఊఁ."

"పెట్టేస్తాను ?"

"ఊఁ."

..................

"అన్నంకావాలా ?"

"వద్దు."

"పచ్చడి ?"

"కొంచెం."

"చాల్నా ?"

"ఊఁ."

"వంట్లో బాగులేదూ ?"

.............

"ఏమండీ ?"

"చాలాబాగుంది."

"ఆ కోపమేమిటి ! ఆ మాటాడక పోవడమేమిటండీ నాన్నగారూ ?" అన్నాది సరస్వతి.

"మాటాడితే తిడుతున్నాడు అనడం, పోనీ నాకెందుకు అని ఊరుకుంటే కోపంఅనడం ! ఏమిటి మీ సాధింపు ? నాకేం బోధపడ్డంలేదు."

(ఉదయం. — శాస్త్రి మూలుగుతూ ఒకమంచం వేసుకొని దానిమీద పండుకొనును.)

"అన్నా ! — ఏంబాధ ? — హా ! దేవుడా ! అన్నన్న,"

"వంట్లో బాగులేకపోతే, నే పక్కవేసేనండీ ? మీరు వేసుకోకపోతే ఏం ?"

.......................

"ఉష్ణం జాస్తీగా వచ్చిందేమిటండీ ?"

"అబ్బ ! ఏంతలనొప్పి? రామ ! రామ !"

సరస్వతి మీ వద్దఉంటుంది, నేను స్నానానికెళ్తాను ?"

"ఊఁ,"

"మధ్యాహ్నం అంటు పడతారా ?"

"నాకు కాఫీచెయ్యాలనప్పుడే బెంగపట్టుగుందేమిటి ? అబ్బబ్బ ! — బాధ ! — నేనిప్పుడు మధ్యాహ్నం అన్నంతింటానని బాండువ్రాయలేను. — రామ! రామ ! —"

"కాళ్లుపట్టేదా ?"

"వద్దు. తమరు స్నానానికెళ్లొచ్చు — తలనొప్పి రా దేవుడా ! ఏంబాధోయి తండ్రీ ! — రక్షించు సాయినా !"

* * *

"అమ్మా ; ఇదుగో, వెయ్యిసార్లు నడుంనొప్పని, కాళ్లుపట్టిస్సేయని, కఫంచేయిస్సిందని ఆయన మూలగడం మనం చూస్తూనేయున్నాంకదా ? మరి ఇప్పుడు నువ్వెందుకలా బెంగపడతావు ? — మరేం భయంలే దూరుకుండూ."

"కాదే ఈసారి కొంచెంజ్వరం జాస్తీగావచ్చిందే; నువ్వువెళ్లి ఆయనవద్దకూర్చుండూ. నేనంటే ఆయనకి బొత్తిగాకోపం."

"మరెవళ్లంటే ఆయనకి కోపంలేదు ?"

"సరే వెళుదూ వేగిరం."

* * *

(మధ్యాహ్నం — శాస్త్రి మంచంమీద మూలుగుతూ — శేషమ్మ కాళ్లుపడుతూ — సరస్వతి ఆ ప్రాంతాన్నే కూర్చొని — రంగడు గారి ఇంట్లోలేరు.)

(ఇంతలో యదుభూషణరావు ప్రవేశించును.)

"ఏమండోయి! శాస్త్రిగారూ! ఉష్ణం ఎలాగుంది ?"

"ఏమీలేదండి. కొంచెం జ్వరవచ్చినది."

"అంతలా మూలుగుతున్నారు ? — పోనీ మీ హోమ్‌డాక్టర్ని తెప్పించుకోగూడదూ ?"

"ఏమవుతో చూడాలింకా !"

"సరే. ఐతే మళ్లీవస్తాను సాయంత్రం ?"

"చిత్తం." (యదుభూషణరావు వెళ్లును.)

* * *

"అబ్బా ! — ఏంబాధ ! — ఏమే సరాయి మొగాడువచ్చి మాటాడుతూవుంటే కదలకుండా కూచుంటావేం ? మతిలేదూ ? — ఏంబాధోయి దేవుడా ! —"

"ఆయ వంతెదూరన్నుంచే మాటాడుతూంటే. కాళ్లుపడుతూన్నదాన్ని నేనెందుకు లేచిపోవడం ? అని కాని; లేకపోతే నాకుమాత్రం అంతసిగ్గు లజ్జ లేదూ ?"

"సరే, కసి నన్నుచంపకు. అబ్బ — కాళ్లుపీకు!"

"ఇవాళపొద్దున్న కమలవచ్చి మీ కెలాగుందో అడిగినప్పుడు ఆవిడ మీ మంచందగ్గిరా రాలేదూ ? దాని కారణ మేమిటన్నాడు ? అంతమాత్రాన్ని ఆ విడని లంజ కిందకట్టేడమేనా ?" అన్నాది సరస్వతి.

"ఐతే నువ్వూ మీ అమ్మకూడావెళ్లి ఆయనతో కులాసాగా మాటాడండి ! — రామ ! రామ ! — ఇంత సేపుగుతిచేస్తే ఎలాగ? — ఏంబాధా! నాయనా దేవుడా ! — "

* * *

(రాత్రి 7 గం॥ల వేళ — శాస్త్రి మూలుగుతూ మంచంమీద. మిగతవారందరూ మంచంవద్ద —)

"అమ్మా ! — దారుణబాధ ! — దేవుడా ! రక్షించుతండ్రీ ! —"

డాక్టర్ని పిల్పించేదా రంగణ్ణిపంపించి ?"

"నీకు కావులిస్తే పిలిపించు. — అబ్బబ్బ ! — హా! దాహం ! —"

"రంగా వేగం పిల్చుకురా డాక్టర్ని, ఆయనతో ఏమిటి."

(రంగడువెళ్లి డాక్టర్ని పిల్చుకొనివచ్చును.)

"ఏమండీ శాస్త్రిగారూ ! ఏమిటండీ చికాకు ?"

"పెళ్లాం, పిల్లలూ. మరేమిటి ? అబ్బా ! రామ! రామ !—"

డాక్టరుగారొచ్చేరు. చికాకేమిటో చెప్పండి. మందిస్తారు."

"నువ్వు ఇంట్లోకివెళ్లొమ్మ. నాకూ తెలుసును; నువ్వు చెప్పనక్కరలేదు. —"

(శేషమ్మ ఇంట్లోకివెళ్లును.)

(డాక్టరు దేహమంతటను పరీక్షించిచూచును.)

"మీ అబ్బాయిని రేపుదయంపంపండి మందిస్తాను. ఇప్పటికీపిల్సు పుచ్చుకోండి."

చిత్తం." (డాక్టరు వెళ్లును.)

"అబ్బా ! బాధ ! బాధ ! — ఏంబాధ —"

* * *

౫

(నడిరేయి — నట్టింట శేషమ్మగారి శవము —



213

ఇల్లంతా నిశ్శబ్దము — పిల్లలందరూ నిద్రలో — శాస్త్రిగారుమాత్రము శవమువద్ద — శేషమ్మగారి ముఖం దివ్యతేజస్సుతో వెలుగుతూంది. —)

"ఎంతపనిచేసింది ! — అబ్బా ! బాధ హెచ్చుతున్నాది. హృదయం పగిలిపోతున్నాది. ఉరిపెట్టుగుంది ! ఓయి దేవుడా ! తల్చుగుంటే గుండె పగిలిపోతున్నాది. — నాబాధలు పడలేకే కాబోలు ఇంత పనిచేసింది ! — అయ్యో ! ఎంతపాపాత్ముణ్ణి. ఇంక నన్ను లోకంలో బ్రతకనిస్తారు, బ్రతకలేను ! జీవితం దుర్భరమనిపిస్తున్నాది ! — హా ! దేవుడా చివర కెంతపనిచేసేవు ! — తండ్రీ నీలీలలు ఎవరెరుగగలరు? అబ్బా ! — పరమపవిత్రురాలైన నాభార్యని చేరుకుంటాను. రక్షించుతండ్రీ ! దేవుడా ! — మాసరస్వతిని కాచు నాయనా ! సర్వేశ్వరుడా! ఆపద్బాంధవుడా, తండ్రీ ! — మా చావులవల్ల మాపిల్లలకు కష్టములు రానియ్యకు తండ్రీ ! మా చావులనుగూర్చి ఇదిగో వ్రాసి ఇక్కడ ఉంచేస్తాను. — తండ్రీ ! నే బ్రతకలేను. ఇదుగో ఈ నల్లమందు, నూనె, భా; కాదు, కాదు నాభార్య అనుసరించినమార్గాన్నే నేనూ అనుసరిస్తాను; ఈ త్రాటితోనే ఉరిపోసుకుంటాను. నాయనా దేవుడా ! రక్షించు నన్ను క్షమించు."

* * *

అనుమాన పిశాచముచే
మనుజులు పీడింపబడి తమసతుల కష్టం
గానకిటుల బాధించిన
మనభారతదేశ మెట్లు భాగ్యముగనునో !


అనుకరణములను చూచి మోసపోకుడు

అమృతాంజనము




అన్ని నొప్పులకు సిద్ధామృతము

అమృతాంజనం డిపో

బొంబాయి — మదరాసు — కలకత్తా